కృష్ణ శతకము

భావార్థ సంగ్రహం :
ఆచార్య యం. కులశేఖర రావు, ఎం. ఏ., పిహెచ్.డి.
తెలుగు శాఖాధ్యక్షులు (రిటైర్డు)
ఉస్మానియా విశ్వ విద్యాలయము, హైదరాబాదు.

ప్రకాశకులు
ఆంధ్ర సారస్వత పరిషత్తు
తిలక్ రోడ్, హైద్రాబాద్ - 500 001.
ఫోన్. నెం. 24753724

కృష్ణ శతకము

భావార్థ సంగ్రహం :

ఆచార్య యం. కులశేఖర రావు, ఎం. ఏ., పిహెచ్.డి.

తెలుగు శాఖాధ్యక్షులు (రిటైర్డు)

ఉస్మానియా విశ్వ విద్యాలయము, హైదరాబాదు.

ప్రకాశకులు

ఆంధ్ర సారస్వత పరిషత్తు

తిలక్ రోడ్, హైద్రాబాద్ - 500 001.

ఫోన్. నెం. 24753724

సర్వస్వామ్య సంకలితము

ప్రథమ ముద్రణ : 2003

ప్రతులు : 1000

వెల రూ : 8/-

పొట్టి శ్రీ రాములు తెలుగు విశ్వ విద్యాలయం
ఆర్థిక సహాయంతో ప్రచురితం

ముద్రణ :

చార్మినార్ ఆర్ట్ ప్రింటర్స్,
4-4-57, గంజి బజార్,
సికింద్రాబాద్ - 500 003.
ఫోన్ : 27710678

జ్ఞానపీఠ పురస్కార గ్రహీత, పద్మభూషణ్ తేది : 13.10.2003

ఆచార్య సి. నారాయణరెడ్డి ఎం.ఎ., పిహెచ్.డి., డి.లిట్.,

అధ్యక్షులు

ఆంధ్ర సారస్వత పరిషత్తు

పీఠిక

తెలుగు భాషా సాహిత్య సంస్కృతుల వికాసాభ్యుదయాలకోసం ఆవిర్భవించిన ఆంధ్ర సారస్వత పరిషత్తు ఆరు దశాబ్దాలకు పైగా ఈ రంగాలకు విశేష సేవలందిస్తున్నది. బహుముఖీనంగా కార్యక్రమాలను చేపట్టి నిర్వహిస్తున్నది. తెలుగు భాషా వ్యాప్తి నిమిత్తం పరిషత్తు ప్రత్యేక పథకాన్ని రూపొందించింది. గ్రామీణ ప్రాంతాలలో నివసిస్తూ పాఠశాలలో విద్యాభ్యాసం చేసే అవకాశం లేనివారు తెలుగు చదువుకునేందుకు వీలు కలిగించి ప్రాథమిక, ప్రవేశ, విశారద (పూర్వోత్తర భాగాలు) పరీక్షలు జరుపుతున్నది.

పరిషత్తు ప్రాచ్య విద్యా కళాశాలను, తెలుగు పండిత శిక్షణ కళాశాలను నడుపుతున్నది. ఇతర విద్యాసంస్థల అవసరాలకు తగినట్లు తెలుగు పాఠ్యగ్రంథాలను రూపొందించి వెలువరిస్తున్నది. అంతేకాదు, వివిధ సాహిత్య ప్రక్రియల్లో పరిషత్తు 130 పైగా గ్రంథాలను ప్రచురించింది.

పరిషత్తుకు ఇది వజ్రోత్సవ సంవత్సరం. ఈ గణనీయ ఘట్టానికి ఉపస్కారకంగా వుండేట్టుగా తెలుగు జాతి సామాజిక నీతికి గతులు నేర్పిన మూడు శతకాలను ప్రచురిస్తున్నాం. అవి కృష్ణ , సుమతీ, వేమన శతకాలు. అటు ధీమాన్యులూ, ఇటు సామాన్యులూ సార్వకాలీనంగా ఉదాహరించదగిన పంక్తులెన్నో వీటిలో ఉన్నాయి.

ఈ శతకాల్లోని పద్యాల్లో ఝటితి స్ఫూర్తి లక్షణమున్నా కొన్ని విశేషాంశాలను విశదీకరించవలసిన అవసరముంది. జీవితంలో, సాహిత్యరంగంలో సమన్వయ శీలాన్ని పెంపొందించుకున్న ఆచార్యులు కులశేఖరరావు గారు ఈ శతకత్రయిలోని పద్యాలకు పరమ పఠనీయ శైలిలో తాత్పర్యం రచించారు. వారికి నా హార్దికాభినందన.

సారస్వత పరిషత్తు చేపట్టిన ఈ ప్రచురణలు సర్వజనామోదం పొందుతాయని ఆశిస్తున్నాను.

కృష్ణ శతకము

1. శ్రీ రుక్మిణీశ కేశవ
నారద సంగీతలోల నగధరశౌరీ
ద్వారకనిలయ జనార్ధన,
కారుణ్యము తోడ మమ్ము గావుము కృష్ణా.

శ్రీ కృష్ణా! రుక్మిణీదేవి భర్తవు. కేశవుడైన విష్ణుమూర్తివి. నీ భక్తుడైన నారదుని కీర్తనము వినడంలో ఆసక్తి కలవాడవు. గోవర్ధన పర్వతాన్ని ఎత్తినవాడవు, పరాక్రమవంతుడవు. ద్వారాకానగర నివాసివి. జనుడనే రాక్షసుని పీడించినవాడవు. మమ్ములను దయతో కాపాడుము.

2. నీవే తల్లివి తండ్రివి
నీవే నా తోడునీడ నీవే సఖుడౌ
నీవే గురుడవు దైవము
నీవే నా పతియు గతియు నిజముగ కృష్ణా.

శ్రీ కృష్ణా! నీవు నాకు తల్లివి, తండ్రివి, నాకు తోడుగా, ఆధారంగా ఉన్నవాడవు. స్నేహితుడవు. విద్యనేర్పించిన గురుడవు. భగవంతుడవు. ప్రభువు నీవే. జీవిత మార్గాన్ని చూపించేవాడవు. ఇది యధార్థము.

భగవంతుడు సర్వాధారుడు.

3. నారాయణ, పరమేశ్వర
ధారాధర నీలదేహ, దానవ వైరీ
క్షీరాబ్ధిశయన యదుకుల
వీరా, ననుగావు కరుణ వెలయగ కృష్ణా.

శ్రీ కృష్ణా! నీవు నారాయణ స్వరూపుడవు. అన్ని దైవతములలో ఉన్నతుడవు. మేఘంవంటి నల్లని శరీరం కలవాడవు. దుష్టరాక్షసులను నశింప చేసినవాడవు. పాల సముద్రంలో శయనించేవాడవు. యాదవుల వంశంలో వీరుడవు. అట్టి నీవు దయా విశేషంతో నన్ను రక్షించుమా.

4. **హరియను రెండక్షరములు**
హరియించును పాతకముల నంబుజనాభా,
హరి, నీనామ మహత్త్వము
హరి హరి, పొగడంగవశమె, హరి శ్రీకృష్ణా.

పద్మము నాభిలో గల నారాయణావతారమైన శ్రీకృష్ణా! హ, రి, అనే రెండక్షరాలు పలుకగానే అన్ని పాపాలు నశిస్తాయి. అటువంటి నీ నామంలో ఉండే గొప్పతనాన్ని పొగడడం ఎట్టివారికైనా సాధ్యమయ్యే పనేనా? కాదని అర్థం.

5. **క్రూరాత్ముడజామీళుడు**
నారాయణ యనుచు నాత్మనందను బిలువన్
ఏరీతి నేలుకొంటివి!
యేరీ నీసాటివేల్పు లెందును కృష్ణా.

ఓ శ్రీకృష్ణా! చాల దుర్మార్గుడైన అజామీళుడు, తన అంత్యకాలంలో, తన కుమారుని ప్రేమతో 'నారాయణా' అని పిలువగానే అతనికి ముక్తిని ప్రసాదించినావు. ఇటువంటి నీకు సమానమైన దైవము లెక్కడ ఉన్నారు? లేరని అర్థం.

6. **చిలుక నొక రమణి ముద్దుల**
చిలుకను శ్రీరామ యనుచు శ్రీపతిపేరం
బిలిచిన మోక్షము నిచ్చితి,
వలరగ మిము దలచు జనుల కదురా కృష్ణా.

శ్రీకృష్ణా! పూర్వం ఒక సుందరి తన పెంపుడు చిలుకను శ్రీరామా అనే విష్ణుమూర్తి పేరుపెట్టి, నోరారాదాన్ని పిలిస్తే, నీవు ఆమెకు మోక్షాన్ని ప్రసాదించినావు కదా. ఇంక, నిన్ను నిరంతరం తలచేవారికి ముక్తిలభించడంలో ఆశ్చర్యమేమి?

7. అక్రూరవరద, మాధవ
చక్రాయుధ, ఖడ్గపాణి శౌరి ముకుందా,
శక్రాది దివిజ సన్నుత,
శుక్రార్చిత, నన్ను కరుణజూడము కృష్ణా.

శ్రీకృష్ణా! నీవు అక్రూరునికి వరాలను ఇచ్చిన వాడవు. సుదర్శనమనే చక్రాన్ని, నందకమనే ఖడ్గాన్ని ధరించిన పరాక్రమ వంతుడవు. ఇంద్రుడు మొదలైన దేవతలవలన స్తుతింపబడినవాడవు. భార్గవునిచేత పూజింపబడినవాడవు. దయతో నన్ను కాపాడవా!

8. నందుని ముద్దుల పట్టివి
మందర గిరిధరుని హరిని మాధవు విష్ణున్
సుందర రూపుని మునిగణ
వందితు నిను దలతు, బక్తవత్సల, కృష్ణా.

శ్రీకృష్ణా! నీవు నందగోపుని ముద్దుల కుమారుడవు. కూర్మావతారంలో మందర పర్వతాన్ని ధరించినవాడవు. భక్తుల పాపాలను హరించే విష్ణుమూర్తివి. లక్ష్మీదేవి భర్తవు. అందమైన స్వరూపం గలవాడవు. మునులు నీకు నమస్కరిస్తుంటారు. భక్తులపై ప్రేమ కలిగిన నిన్ను నేను మనస్సులో భావిస్తాను.

9. ఓ కారుణ్యపయోనిధి,
నాకాధారంబవగుచు నయముగ బ్రోవన్
నాకేల యితర చింతలు?
నాకాధిప వినుత, లోకనాయక, కృష్ణా.

శ్రీకృష్ణా! దయకు సముద్రం వంటివాడా, నీవు నాకు ఆధారమయి, ప్రేమతో నన్ను కాపాడుతున్నప్పుడు, నాకు ఇతరవిచారము లెందుకు? నీవు స్వర్గాధిపతియైన ఇంద్రునితో స్తుతింపబడేవాడవు. లోకానికి నాయకుడైనవాడవు.

10. వేదంబులు గననేరని
యాదిపరబ్రహ్మమూర్తి వనఘు, మురారీ,
నాదిక్కు చూచి కావుము,
నీదిక్కే నమ్మినాడ, నిజముగ కృష్ణా.

శ్రీకృష్ణా! నాలుగు వేదాలు కూడ నిన్ను తెలుసుకినలేని పరమాత్మ స్వరూపం నీది. పాపముల నశింప చేసే వాడవు. ముర అనే సురను సంహరించినవాడవు. నీవే నాకు దిక్కని నమ్మిన వాణ్ణి. ఇది నిజము. నన్ను నీవు దయతో కాపాడుమా!

11: పదునాలుగు భువనంబులు
కుదురుగ నీకుక్షి నిలుపుకొను నేర్పరివై
విదితంబుగ నా దేవకి
యుదరములోనెట్టు లొదిగియుంటివి? కృష్ణా.

శ్రీకృష్ణా! పరమాత్ముడవైన నీవు, నీ బొజ్జలో పదునాల్గులోకాలను నిలకడగా నిలిపినట్టి నేర్పరివి. ఇట్టి నీవు, దేవకీదేవి గర్భంలో ఏ విధంగా ఒదిగియుండి శ్రీకృష్ణునిగా జన్మించినావు. ఇది ఆశ్చర్యం కదా. చతుర్దశ భువనాలురా – అంటే పదునాల్గులోకాలు ఇవి: భూలోకము, భువర్లోకము, సువర్లోకము, మహర్లోకము, జనలోకము, తపోలోకము, సత్యలోకము (ఇవి ఊర్ధ్వలోకాలు) అతలము, వితలము, సుతలము, రసాతలము, మహాతలము, తలాతలము, పాతాళము (ఇవి అధోలోకాలు).

12. అష్టమి రోహిణి ప్రొద్దున
నష్టమ గర్భమున బుట్టి యా దేవకికిన్
దుష్టుని కంసు వధింపనె
సృష్టిప్రతిపాలనంబు సేయగ కృష్ణా.

శ్రీకృష్ణా! లోకాలను రక్షించడానికి, నీవు రోహిణీ నక్షత్రంతో కూడిన అష్టమీ తిథినాడు, దేవకీదేవికి ఎనిమిదవ సంతానంగా జన్మించి దుర్మార్గుడైన కంసుని వధించినావు.

13. అల్ల జగన్నాథుకు వ్రే
పల్లియ క్రీడార్థమయ్యె పరమాత్మునకున్
గొల్ల సతియా యశోదయు
తల్లియునై చన్నుగుడిపె దనరగ కృష్ణా.

శ్రీకృష్ణా! నీ లీలలు అమోఘములు. సకలలోకాలకు అధిపతివైన నీవు శ్రీకృష్ణుడవై గొల్లపల్లెలో పెరిగి అచట ఆటలాడినావు. గోపాలకుడైన నందుని భార్య యశోదాదేవి. నీకు తల్లియై నీకు పాలిచ్చి తృప్తితో పెంచిందికదా.

14. అందెలు గజ్జెలు మ్రోయగ
చిందులు ద్రొక్కుచును వేడ్క చెలువారంగా
నందుని సతి యా గోపిక
ముందర నాడుదువు మిగుల ముద్దుగ కృష్ణా.

శ్రీకృష్ణా! నీవు కాళ్ళకు, అందెలు, నడుముకు గజ్జెలు ధరించి, నందుని భార్యయైన యశోదాదేవికి సంతోషం కలిగే విధంగా, ఆమె ఎదుట చిందులు వేస్తూ, మురుస్తూ, ఆటలాడుతావు కదా.

15. హరిచందనంబు మేనున
కరమొప్పెదు హస్తములును కంకణరవముల్
ఉరమున రత్నము మెరయగ
బరగితివౌ నీవు బాలప్రాయము కృష్ణా.

శ్రీకృష్ణా చిన్నతనంలో నీవు శరీరంపై మంచి గంధం పూసుకొని, చేతులకు కంకణాలు ధరించి, వక్షస్థలంలో (కౌస్తుభమనే) రత్నాన్ని వహించి, ముద్దులొలుకుతు మెలగినావు కదా. (బాలకృష్ణుడు అత్యంత సుందరుడని కవులు పొగడినారు).

16. పాణితలంబున వెన్నయు
వేణీ మూలంబునందు వెలయ పింఛం
బాణీ ముత్యము ముక్కున
నాణెముగా దాల్చు లోకనాథుడ, కృష్ణా.

శ్రీకృష్ణా! నీవు లోకాలన్నిటికి అధిపతివైనా, కృష్ణావతారంలో చేతిలో వెన్నముద్దను, సిగలో నెమలిపింఛాన్ని, ముక్కున ఆణిముత్యాన్ని దాల్చి పసిబాలుని వలె మురిపించినావు.

17. మడుగుకుజని కాళీయుని
పడగలపై భరతశాస్త్ర పద్ధతి వెలయన్
కడువేడుకతో నాడెద
నడుగులు నా మదిని దలతు, నచ్చుత, కృష్ణా.

శ్రీకృష్ణా! మడుగున నీరు త్రాగడానికి వచ్చిన గోవులను బాధిస్తున్న కాలీయుడనే సర్పం నివసిస్తున్న సరస్సు వద్దకు వెళ్లి, ఆ కాళీయుని పడగలమీద భరతనాట్య భంగిమలు ప్రకటం అయ్యేటట్లుగా నటించిన నీ పాదాలను ఎప్పుడు భక్తితో నా మనస్సులో తలచుకొంటాను.

18. బృందావనమున బ్రహ్మా
నందార్భక మూర్తి వేణునాదమునీవా
మందారమూలమున ? గో
విందా పూరింతువౌర, వేడుక కృష్ణా.

శ్రీకృష్ణా! మహదానందాన్ని కలుగజేసే బాలరూపం ధరించిన వాడవై, నీవు బృందావనంలో మందారవృక్షం మొదట నిలిచి ఆశ్చర్యాన్ని, సంతోషాన్ని కలిగించే విధంగా వేణుగానం చేస్తుంటావు.

19. వారిజ నేత్రులు యమునా
వారిని జలకంబులాడ వచ్చిన నీవా
చీరలు ముచ్చిలి యిచ్చితి
నేరుపురా యదియనీకు నీతియె కృష్ణా.

శ్రీకృష్ణా! యమునా నదిలోజలకాలాడడానికి సుందరీమణులైన గొల్లభామలు వచ్చినప్పుడు నీవు ఒడ్డున నున్నవారి చీరలను దొంగిలించి తిరిగి యిచ్చినావు. ఇది నీ నేర్పరితన మనవచ్చునా? ఇట్లా చేయడం నీకు నీతితో కూడిన పనియేనా?

20. దేవేంద్రుడలుక తోడను
వావిరిగా రాళ్లవాన వడిగురియింపన్
గోవర్ధన గిరి యెత్తితి,
గోవుల గోపకుల గాచుకొరకై కృష్ణా.

శ్రీకృష్ణా! నీవు రుక్మిణి మొదలైన అష్టమహిషును పెండ్లాడితివి. అంతేకాక, నరకాసురుని సంహరించి, పదునారువేల నూరుమంది రాజకుమారికలను చేపట్టితివి. వీరందరు కోరినవిధంగా, వివిధ రూపాలను ధరించి వారికి తృప్తి కలిగేటట్లుగా క్రీడిస్తావు. ఇది ఎంత అద్భుతము!

21. అండజవాహన విను బ్ర
హ్మాండంబులు బంతులటుల యాడెడు నీవా
కొండను నెత్తితివందురు,
కొండే కపనిగాక దొడ్డకొండా కృష్ణా.

శ్రీకృష్ణా! నీవు, గరుత్మంతుడు వాహనంగా గలవాడవు. బ్రహ్మాండ గోళాలను బంతులుగా చేసికొని ఆడే సామర్థ్యం గలవాడవు. గోవర్ధన పర్వతాన్ని ఎత్తడం నీకెంత పని ? అది నీకు చిన్న పని. దాన్ని పెద్దపని అని అనగలమా.

శ్రీకృష్ణుని పరమాత్మ స్వరూపాన్ని సూచించినాడు కవి.

22. అంసాలంబిత కుండల
కంసాంతక, నీవు ద్వారకాపురిలోనన్
సంసారిరీతి నుంటివి!
హంసేంద్ర, విశాలనేత్ర, అచ్యుత, కృష్ణా.

శ్రీకృష్ణా! అచ్యుతా, పద్మదళాల వంటి విశాల నేత్రములు గలవాడా. భుజములదాకా వ్రేలాడుతున్న కర్ణకుండలాలు కలవాడా, కంసుని సంహరించినవాడా, నీవు పరమ యోగీశ్వరుడవు. పరబ్రహ్మమూర్తివి. అయినను ద్వారకానగరంలో సంసారివలె భార్యాపుత్రులతోను, బంధువులతోను కూడి ఉన్నావు.

23. పదియారువేల నూర్వురు
సుదతులు నెనమండ్రు నీకు సొంపుగ భార్య
ల్విదితంబుగ బహురూపుల
వదలక రమియింతు వౌర వసుధను కృష్ణా.

శ్రీకృష్ణా! నీవు రుక్మిణి మొదలైన అష్టమహిషులను పెండ్లాడితివి. అంతేకాక, నరకాసురుని సంహరించి, పదునారువేల నూరుమంది రాజకుమారికలను చేపట్టితివి. వీరందరు కోరినవిధంగా, వివిధ రూపాలను ధరించి వారికి తృప్తి కలిగేటట్లుగా క్రీడిస్తావు.

24. అంగన పనుపున ధోవతి
కొంగున నటుకులను ముడుచుకొని వచ్చిన యా
సంగతివిని దయనొసగితి
రంగుగసంపదలు, లోక రక్షక కృష్ణా.

ఈ పద్యంలో శ్రీకృష్ణుని బాల్యమిత్రుడైన కుచేలుని కథ సూచితమైంది.

శ్రీకృష్ణా! లోకాలను కాపాడేవాడా, తన భార్య కోరగా నీ బాల్యస్నేహితుడైన కుచేలుడు ఉత్తరీయము చెంగున అటుకులను మూటగట్టుకొని వచ్చినాడు. ఆ విషయాన్ని గ్రహించిన నీవు, ఆ కుచేలునకు ఆనందాన్ని కలిగించే ధనధాన్యాలు ప్రసాదించినావు కదా.

25. హా వసుదేవ కుమారక,
కావుమునామానమనుచు కామిని వేడన్
ఆ వనజాక్షికి నిచ్చితి
శ్రీవర, యక్షయ మటంచు చీరలు, కృష్ణా.

ఈ పద్యంలో ద్రౌపదిని పందెంలో ధర్మరాజు ఓడిపోయినప్పుడు ఆమెను దుశ్శాసనుడు సభలోనికి ఈడ్చుకొని వచ్చి వలువలూడదీయబోగా ఓ కృష్ణా, వసుదేవకుమారా, నా మానం కాపాడమని ప్రార్థించగా ఆమెకు ఎడతెగని చీరలను ప్రసాదించి కాపాడినావుకదా.

26. శుభ్రమగు పాంచజన్యము
అభ్రంకషమగుమ్రోవనావహభూమిన్
విభ్రమలగు దనుజ సుతా
గర్భంబుల పగులజేయు ఘనుడవు కృష్ణా.

శ్రీకుష్ణుని రాక్షస సంహార పరాక్రమం ఈ పద్యంలో వర్ణితమైంది..

శ్రీకృష్ణా! నీవు యుద్ధరంగంలో స్వచ్ఛమైన పాంచజన్యమనే నీ శంఖాన్ని పూరించగా ఆ శంఖధ్వని అసురులకు విభ్రాంతి కలిగించింది. దాని వలన రాక్షస స్త్రీల గర్భాలు విచ్ఛిత్తి కావడం జరిగింది. నీవు గొప్పవాడవు కదా.

27. జయమును విజయున కియ్యవె
హయములములు కోలమోపి యదలించి మహా
రయమున రొప్పవె తేరున
భయమున రిపుసేన విరిగి పారగ, కృష్ణా.

ఈ పద్యంలో మహాభారత యుద్ధ ఘట్టం సూచింపబడింది.

శ్రీకృష్ణా! కురుపాండవ సంగ్రామంలో నీవు అర్జునునకు రథసారథివై, దండమును చేత ధరంచి అశ్వములను అదిలించగా, అవి వేగంగాపరిగెత్తినప్పుడు శత్రుసైన్యం భయపడి పరుగెత్త లేదా. అర్జునునకు విజయాన్ని ప్రసాదించలేదా.

28. దుర్జనులగు నృపసంఘము
నిర్జింపగ దలచినీవు, నిఖిలాధారా,
దుర్జనులను వధియింపను
నర్జునునకు నీవు సరథివైతివి, కృష్ణా.

శ్రీకృష్ణా! సమస్త లోకాలకు ఆధారమైనవాడా, నీవు దుష్టులైన ప్రభువులను జయించడం కొరకు, దుర్మార్గులను సంహరించడానికిని అర్జునునకు సారథిగా ఉండినావు. (అతనిచేత ఆ పని చేయించినావు).

ఈ పద్యంలోను మహాభారత యుద్ధం సూచితమైంది.

29. శక్ర సుతు గాచుకొరకై
చక్రము చేపట్టి భీష్మజంపగ జను నీ
విక్రమ మేమని పొగడుదు?
నక్రగ్రహ సర్వలోక నాయక కృష్ణా.

శ్రీకృష్ణా, నీవు మొసలిని సంహరించి, గజేంద్రుని రక్షించిన వాడవు. సకల లోకాధిపతివి, మహాభారత యుద్ధంలో ఆయుధాన్ని ధరించనని ప్రతిజ్ఞచేసినావు. అయినను, కౌరవ సైన్యాధిపతి భీష్మణ్ణి అర్జునుడు జయించి సధ్యం కాకపోతే, నీవు భీష్ముని సంహరిస్తానని, అర్జునుని కాపాడుతానని చక్రాన్ని చేపట్టి ముందుకురికినావు. ఇట్టి నీ కార్యాన్ని కీకేమని స్తుతింతును?

30. దివిజేంద్రసుతుని జంపియు
రవిసుతు రక్షించినావు రఘురాముడవై,
దివిజేంద్ర సుతుని గాచియు
రవిసుతుబరిమార్చి తేక! రణమున కృష్ణా.

శ్రీకృష్ణా, నీవు త్రేతాయుగంలో రఘువంశంలో శ్రీరాముడవై జన్మించి, సూర్యకుమారుడైన సుగ్రీవునితో స్నేహంచేసి, ఇంద్రకుమారుడైన వారిని సంహరించినావు. ద్వాపరయుగంలో శ్రీకృష్ణుడవై ఇంద్రకుమారుడైన అర్జునుని రక్షించి యుద్ధరంగంలో సూర్యకుమారుడైన కర్ణుని సంహరింపచేసినాను.

31. దుర్భరబాణము రాగా
గర్భములో నుండి యభయవ గావుమటన్నన్
నిర్భర కృప రక్షించితి
వర్భకు నభిమన్య సుతుని, నచ్యుత, కృష్ణా.

శ్రీకృష్ణా! నశ్వరములేని వాడా! పాండవ వంశ నిర్మూలనం చేయదలిచిన అశ్వత్థామ, బ్రహ్మశిరోనామాస్త్రాన్ని ప్రయోగించిననాడు. ఆ అస్త్రం ఉత్తర గర్భంలో ఉండిన అభిమన్యుని కుమారుని సంహరింపవచ్చింది. అప్పుడు పసివాడు నన్ను కాపాడుమని నిన్ను ప్రార్థింపగా, ఆపరీక్షిత్తును రక్షించినావు కాదా!

32. గిరులందు మేరులౌదువు
సురలందున నింద్రుడౌదు, చుక్కలలోనన్
బరమాత్మ, చంద్రుడౌదువు
నరులందున నృపతి లౌదు, నయముగ కృష్ణా.

శ్రీకృష్ణా! పరమాత్మా, నీవు సర్వశ్రేష్ఠుడవు. కొండలయందు నీవు మేరుపర్వతమవు(బంగారుకొండవు). దేవల్లో ఇంద్రుడవు. చుక్కల్లో చంద్రుడవు. మానవులలో ధర్మాత్ముడగు రాజువు. అన్నింట పరమాత్ముడుత్తముడని అర్థం.

33. చుక్కల నెన్నగవచ్చును
గ్రక్కున భూరేణువులను గనుతింపనగున్

చొక్కపు నీ గుణజాలము
నక్కజమగు లెక్కపెట్ట నజునకు కృష్ణా.

శ్రీకృష్ణా! అసంఖ్యాకంగా ఉండే నక్షత్రాలను లెక్కపెట్టవచ్చు. భూమిలోని ఇసుక రేణువులను వెంటనే లెక్కింపవచ్చును. కాని బ్రహ్మవంటి వానికికూడా నీ ఉత్తమ గుణాలు ఎన్ని చెప్పడం సాధ్యం కాదు. (నీ గుణాలు అనంతమైనవి కదా).

34. కుక్షిని సకల జగంబులు
నిక్షేపము చేసి ప్రళయ నీరధినడుమన్
రక్షక, వటపత్రముపై
దక్షత పవళించునట్టి ధన్యుడ, కృష్ణా.

శ్రీకృష్ణా! జగద్రక్షకా, నీవు సకల లోకాలను నీ గర్భంలో దాచిన వాడవు. ఈ లోకాలన్ని మహా ప్రళయకాలంలో జలప్రవాహంలో మునిగి పోయినాయి. ఆ ప్రళయ సమయంలో నీవు వటపత్రశాయివై, ఆ జలధిలో వినోదంగా పరుండి ఉంటివి. నీవు ధన్యుడవు.

35. విశ్వోత్పత్తికి బ్రహ్మవు
విశ్వము రక్షింప దలచి విష్ణుడవనగా
విశ్వము జెరుపను హరుడవు
విశ్వాత్మక, నీవెయగుచు వెలయుదు కృష్ణా.

శ్రీకృష్ణా! నీవు సకలలోకాలకు ఆత్మవు. ఈ లోకాలను పుట్టించిన బ్రహ్మవు నీవే. ఈ లోకాలను కాపాడే విష్ణుమూర్తివి నీవే. ఈ లోకాలను నశింపచేసే శివుడవును నీవే. సృష్టి స్థితి లయములనే కార్యాలను నెరవేర్చే త్రిమూర్తులైన బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులు నీ దూపాలే అనుట.

36. అగణిత వైభవ కేశవ,
నగధర వనమాలి యాదినారాయణ, యో
భగవంతుడ శ్రీమంతుడ,
జగదీశ్వర శరణుశరణు శరణము కృష్ణా.

శ్రీకృష్ణా! లెక్క లెనన్ని వైభవాలు కలవాడా, కేశవా, గోవర్ధన పర్వతాన్ని ధరించినవాడా, తులసిమాలను ధరించినవాడా. విష్ణుమూర్తీ, దైవమా, లక్ష్మీపతీ, లోకాధినాయకా, ముమ్మాటికి నీవే నాకు రక్షకుడవు. పద్యమంతా సంబోధనాత్మకంగా ఉండడం విశేషం.

37. మగమీనమవై జలధిని
పగతుని సోమకుని జంపి పద్మభవునకు
న్నిగమముల దెచ్చియిచ్చితి
సుగుణా కర, మేలు, దివ్యసుందర, కృష్ణా.

శ్రీకృష్ణా! నీనవు మంచిగుణములకు నిలయమైనవాడవు. అందమూన ఆకారం గలవాడవు. సోమకుడనే రాక్షసుడు వేదాలను దొంగిలించి సముద్రంలో దాగినాడు. అపుడు నీవు మత్స్యావతారాన్ని దాల్చి సోమకాసురుని సంహరించి వేదాలను తెచ్చి బ్రహ్మకిచ్చినావు. భళీ!

38. అందరు సురలును దనుజులు
పొందుగ క్షీరాబ్ధి దరువ పొలుపున నీవా
నందముగ కూర్మరూపున
మందరగిరి యెత్తి తౌర, మాధవ, కృష్ణా.

శ్రీకృష్ణా! లక్ష్మీపతీ, అమృతాన్ని పొందడానికి దేవతలు, రాక్షసులు ఏకముగా మందర పర్వతాన్ని కవ్వంగా చేసికొని, పాల సముద్రాన్ని చిలికినారు. ఆ సయంలో మందర పర్వతం పాలసముద్రంలో మునగకుండ, నీవు కూర్మావతారాన్ని దాల్చి నేర్పుతో ఆ కొండను ఎత్తి ఉంచినావు. ఎంత ఆశ్యర్యమిది!

39. ఆదివరాహుడవై నీ
వాదనుజ హిరణ్యనేత్రు హతుజేసి తగన్
మోదమున సురలు పొగడగ
మేదిని వడి గొడుగునెత్తి మెరసితి కృష్ణా.

శ్రీకృష్ణా! పూర్వము హిరణ్యాక్షుడనే రాక్షసుడు భూమిని చుట్టి దాన్ని నీటిలో ముంచినాడు. అపుడు నీవు వరాహావతారమును ఎత్తి హిరణ్యాక్షుని సంహరించినావు. భూమిని సముద్రమునుంచి గొడుగువలె నెత్తగా, దేవతలు నిన్ను స్తుతి చేసినారు.

40. **కెరలి యరచేత కంబము**
నరుదుగ వేయుటను వెడలి యసురేశ్వరునిన్
ఉదరము జీరి వధించితి
నరహరి రూపావతార, నగధర, కృష్ణా.

శ్రీకృష్ణా! గోవర్ధన గిరిధరా, శ్రీమహావిష్ణువు అంతటా నిండియున్నాడని ప్రహ్లాదుడు పలికినప్పుడు, కోపగించిన హిరణ్యకశిపుడు ఏడీ ఆ విష్ణువు? ఈ స్తంభంలో చూపమని దాన్ని అరచేతితో చరచితాడు. నీవా స్తంభం నుండి నరసింహమూర్తిగా వెలువడినావు. దుష్టుడైన హిరణ్యకశిపుని పొట్ట చీల్చి సంహరించినావు.

41. **వడుగడవై మూడడుగుల**
నడిగితివౌ, భళిర భళిర! అఖిలజగంబుల్
తొడిగితివి నీదు మేనున
కడు చిత్రము నీ చరిత్ర ఘనమవు కృష్ణా.

శ్రీకృష్ణా! మేలు మేలు! నీవు వామన బ్రహ్మచారివై (వామనావతారం ఎత్తి) బలిచక్రవర్తిని మూడడుగుల నేల యాచించినావు. ఆ రాజు దానినిచ్చిన వెంటనే రెండడుగులతోనే లోకములన్నిటిని ఆక్రమించినావు. నీ చరిత్ర చాల చిత్రమైంది. అత్యద్భుతమైంది.

42. **ఇరువదొకమారు నృపతుల**
శిరముల ఖండించితౌర! చేగొడ్డంటన్
ధర కశ్యపునకు నిచ్చియు
బరగవె జమదగ్ని, రామభద్రుడ, కృష్ణా.

శ్రీకృష్ణా! జమదగ్ని కుమారుడైన పరశురామా, నీ తండ్రిని కార వీర్యార్జునుడు చంపినందుకు కోపించి భూమిపైగల రాజులను ఇరువదియొక్క మారులు శిరస్సులను

చేగొడ్డలిచే ఖండించి చంపినావు. నీ పరశురామావతార విశేషాలు ఆశ్చర్యాన్ని కలుగ జేస్తాయి. భూమినికశ్యపునకు దానం చేసినావుకదా.

43. దశకంఠుని బరిమార్చియు
కుశలముతో సీత దెచ్చుకొనియు నయోధ్యన్
విశదముగ కీర్తి నేలితి
దశరథ రామావతార, ధన్యుడ, కృష్ణా.

శ్రీకృష్ణా! నీవు దశరథునకు కుమారుడుగా శ్రీరాముడై జన్మించినావు. అరణ్యావాసం చేసే సమయంలో రావణుడు సీతను అపహరించగా నీవా దశకంఠుని సంహరించి సీతను క్షేమంగా తెచ్చుకొన్నావు. అయోధ్యానగరంలో రాజువై కీర్తితో ప్రజలు మేలని పొగుడుతుండగా రాజ్యపాలన చేసినావు.

44. ఘనులగు ధేనుక ముష్టిక
దనుజుల చెండాడి తౌర! తగ భుజశక్తిన్
అనఘాత్మ, రేవతీ పతి
యనగా బలరామ మూర్తివైతివి, కృష్ణా.

శ్రీకృష్ణా పుణ్య స్వభావం కలవాడా, నీవు బలరామ మూర్తివై స్వరూపం దాల్చి ధేనుకుడు, ముష్టికుడు అనే దుష్టరాక్షసులను నీ భుజశక్తితో సంహరించినావు (ఆయుధమ్ముతో కాదనుట). నీవు రేవతీ దేవిని వివాహమాడినావు. (బలరాముడు నవమావతారుడని భాగవతం చెబుతున్నది-ఉత్పల).

45. త్రిపురాసురభార్యల నతి
నిపుణతతో వ్రతముచేత నిలిపిన కీర్తుల్
కపటపురాజవు భళిరే
కృపగల బౌద్ధావతార, ఘనుడవు కృష్ణా.

శ్రీకృష్ణా! నీవు గొప్పవాడవు. త్రిపురులను రాక్షసుల భార్యలు పతివ్రతలు. వారి పాతివ్రత్యం వారి భర్తలను రక్షించేది. అపుడు విష్ణువు బుద్ధావతారం దాల్చి త్రిపురాసురుల భార్యల పాతివ్రత్య భంగం చేసినాడు. ఎంత గయగలవాడవు? ఎంత ఘనుడవు? (వ్యాజనింద).

46. వలపుల తేజీ నెక్కియు
నిలపై ధర్మంబు నిలుప హీనుల దునుమన్
కలియుగము తుదిని వేడుక
కలికివి గా నున్న లోక కర్తవు కృష్ణా.

శ్రీకృష్ణా! కలియుగంలో పాపాలు పెరిగిపోగా, దుర్మార్గులను సంహరించదానికి, ధర్మాన్ని రక్షించదానికి, అందమైన గుర్రాన్ని అధిరోహించి, కల్కి అవతారాన్ని ధరించిన లోక కారకుడవు నీవు కదా.

47. వనజాక్ష భక్తవత్సల,
ఘనులగు త్రైమూర్తులందు కరుణానిధివై
మను నీ సద్గుణజాలము
సనకాది మునీంద్రు లెన్నజాలరు, కృష్ణా.

శ్రీకృష్ణా! పద్మాల వంటి సుందరమైన కన్నులు కలవాడా, భక్తులపై వాత్సల్యం కలిగిన వాడా, త్రిమూర్తులైన బ్రహ్మవిష్ణుమహేశ్వరులలో నీవు దయాసముద్రుడవు. సనకసనందనాది మహాభక్తులు నీ మంచి గుణాలను పొగడజాలరు. నిన్ను కీర్తించ నేనెంతటివాడను? విష్ణుమూర్తి లోకోత్తరమైన సౌందర్యం కలవాడు. సనకాది మునీంద్రులు గొప్ప విష్ణుభక్తులు.

48. అపరాధ సహస్రంబుల
నపరిమితములైన యఘము లనిశమునేనుం
గపటాత్ముదనై జేసితి
చపలుని ననుగావు, శేషశాయివి కృష్ణా.

శ్రీకృష్ణా! నీవు ఆదిశేషునిపై శయనించినవాడవు. నేను నిరంతరము అనేక అపరాధాలను, అంతులేని పాపాలను చేసినాను. దుష్టమైన ఆలోచనలను కలవాడను. అట్టి స్థిరబుద్ధిలేని నన్ను కాపాడుము.

49. నరపశువు మూఢ చిత్తుడ
దురితారంభుడను మిగుల దోషగుడను నీ

గురుతెరుగ నెంత వాడను
హరి నీవే ప్రాపు దాపు నౌదువు కృష్ణా.

శ్రీకృష్ణా! నేను మనుష్యుల్లో పశువు వంటి వాణ్ని (అంటే అజ్ఞానిని). మూర్ఖుడిని. దుష్టమైన పనులు చేసిన వాణ్ని. అనేక దోషాలు కలవాణ్ని. నీ లక్షణాలను, నీ శక్తిని తెలిసికొనే శక్తిలేనివాణ్ని. ఓహరీ, నీవే నాకు దిక్కు. నీనవే నాకు ఆశ్రయము కావలెను.

50. పరనారీ ముఖ పద్మము
గురుతగు కుచకుంభములను గొప్పును నడుమున్
అరయంగనె మోహింతురు
నిరతము నిను భక్తి గొల్వనేరరు, కృష్ణా.

శ్రీకృష్ణా, లోకంలో జనులు సామాన్యంగా, ఇతరుల స్త్రీల పద్మాల్లాంటి ముఖాలను, ఎత్తయిన కుంభాలవంటి పాలిండ్లను, సుందరమైన కొప్పును, అందమయిన నడుమును చూడగానే మోహించి నిరంతరము వారి భ్రమలో పడుదురు. కాని, నిన్ను మాత్రం భక్తితో సేవించడానికి పూనుకొనరు. (లోకంలోని జన చిత్త వృత్తిని కవి చెప్పినాడు).

51. పంచేంద్రియ మార్గంబుల
కొంచెపు బుద్ధిని చరించి కొన్ని దినంబుల్
ఇంచుక సజ్జన సంగతి
నెంచగ మిమ్మెరిగినాడ నెప్పుడె, కృష్ణా.

శ్రీకృష్ణా! కన్ను, చెవి, ముక్కు, నాలుక, చర్మము అనే పంచేంద్రియాల వలలో నేను తగుల్కొని ఉన్నాను. ఇంతకాలం అల్పబుద్ధితో రోజులు గడిపినాను. మంచివారల స్నేహం వలన మిమ్ముల గూర్చి తెలుసుకొన్నాను. నా తప్పులను నీవు రక్షించవా!

52. దుష్టుండ ననాచారుడ
దుష్టచరిత్రుడను, చాల దుర్బుద్ధిని, నే
నిష్ఠనిను గొల్వనేరని
కష్టుడ నను గావుకావు కరుణను, కృష్ణా.

శ్రీకృష్ణా! నేను సదాచారాలు తెలియనివాడను. చెడు ప్రవర్తన గల దుష్టుణ్ణి. చాల చెడ్డబుద్ధి గలదాణ్ణి. కనీసం నిన్ను వినయంతో సేవించదానికి చేతకాని కష్టాత్ముడను. నన్ను దయతో కాపాడుమా.

భక్తుడు తనను తాను అల్పుడుగా భావించి భగవంతుని సేవించే పద్ధతి భక్తి సంప్రదాయంలో ఉన్నది.

53. **కుంభీంద్రవరద, కేశవ**
జంభాసురవైరి, దివిజ సన్నుత చరితా,
అంభోజనేత్ర, జలనిధి
గంభీరా, నన్ను గావు కరుణను కృష్ణా.

శ్రీకృష్ణా! గజరాజును మొసలిబారినుండి రక్షించినవాడవు. అందమైన శిరోజాలు కలవాడవు. జంభాసురుని సంహరించినవాడవు. దేవతల చేత కీర్తింప బడేవాడవు. పద్మాలవంటి (పద్మదళాల వంటి) విశాలమైన కన్నులు గలవాడవు. సముద్రం లాంటి గంభీరుడవు. ఇట్టి నీవు నన్ను దయతో కాపాడుము.

54. **దిక్కెవ్వరు ప్రహ్లాదుకు**
దిక్కెవ్వరు పాండుసుతుల దీనులకెపుడున్
దిక్కెవ్వరు య్యహల్యకు
దిక్కెవ్వరు నీవెనాకు దిక్కువు, కృష్ణా.

శ్రీకృష్ణా! ప్రహ్లాదుని హిరణ్యకశిపుని బారినుంచి కాపాడినవారెవరు? పాండురాజు కుమారులైన పాండవులను రక్షించిన వారెవరు? దీనులకు, దిక్కులేనివారికి దిక్కెవరు? అహల్యకు శాపవిమోచనం చేసి రక్షించిన వారెవరో, అట్టి భగవంతుడా, నీవు నన్ను రక్షించుము.

55. హరినీవు దిక్కు నాకును,
సిరితోనేతెంచి మకరి శిక్షించి దయన్
బరమేష్ఠిసురలు బొగడగ
కరిగాచినరీతి నన్ను గావుము, కృష్ణా.

శ్రీకృష్ణా! గజరాజు మొసలికి పట్టుబడి శక్తిహీనుడై నిన్ను ప్రార్థించినాడు. నీవు బ్రహ్మాది దేవతలు పొగడగా, లక్ష్మీదేవితో వచ్చి గజరాజును రక్షించి మొసలిని శిక్షించినావు. అదే విధంగా (కష్టాల్లో చిక్కుకొన్న) నన్ను దయతో కాపాడుమా! శ్రీహరీ నీవే నాకు దిక్కు

56. పురుషోత్తమ, లక్ష్మీపతి
సరసిజగర్భాది మౌని సన్నుత చరితా,
మురభంజన, సుర రంజన
వరదుడవగు నాకు, భక్తవత్సల, కృష్ణా.

శ్రీకృష్ణా! నీవు పురుషుల్లో ఉన్నతోన్నతుడవు. లక్ష్మీదేవి భర్తవు. బ్రహ్మచేతను, మునీంద్రుల చేతను కీర్తింపబడినవాడా, మురయనేరాక్షస సంహారం చేసినవాడా, దేవతలకు సంతోషం కలిగించేవాడా, భక్తులపై వాత్సల్యం కలవాడా, నాపట్ల వరముల ప్రసాదించువాడవగుము.

57. క్రతువులు తీర్థాగమములు
వ్రతములు దానములు సేయవలయును లక్ష్మీ
పతి, మిముదలచినవారికి
సతులిత పుణ్యములు గలుగుటరుదా, కృష్ణా.

శ్రీకృష్ణా! లక్ష్మీపతీ, యజ్ఞాలు చేయడం, పుణ్యనదుల్లో స్నానాలు చేయడం, నోములు దానాలు చేయడం వంటివాటి వలన పుణ్యం కలుగుతుంది. కాని మిమ్ము భావించేవారికి అసామాన్యమైన పుణ్యం లభించడంలో ఆశ్యర్యం ఏమున్నది.

58. స్తంభమున వెడలి దానవ
డింభకు రక్షించు నట్టి రీతిని వెలయన్
అంభోజనేత్ర, జలనిధి
గంభీరుడ, నన్నుగావు కరుణను, కృష్ణా.

శ్రీకృష్ణా! పద్మనేత్రా. నీవు ప్రహ్లాదుని కాపాడడానికి స్తంభం నుంచి వెలువడినావు. హిరణ్యకశిపుని సంహరించి నీ భక్తుడైన ప్రహ్లాదుని రక్షించినావు. ఆ విధంగానే, నన్ను దయతో నీవు రక్షించుమా.

59. శతకోటి భానుతేజా
యతులిత సద్గుణ గణాఢ్య యంబుజనాభా
రతినాథజనక లక్ష్మీ
పతిహిత, ననుగావు భక్త సన్నుత కృష్ణా.

శ్రీకృష్ణా! నీవు నూరుకోటి సూర్యులతో సమానమైన ప్రకాశం గలవాడవు. ఇతరులకు సాటి కానిమంచి గుణముల చేత అధికుడవు. పద్మనాభుడవు. మన్మథునికి తండ్రివి. లక్ష్మీదేవికి భర్తవు, హితుడవు. భక్తులచేత స్తుతింపబడేవాడవు. ప్రభూ, నన్ను కాపాడుమా.

60. మందుడ నేదురితాత్ముడ
నిందలకొడిగట్టినట్టి నీచుని నన్నున్
సందేహింపక కావుము,
నందుని వరపుత్ర, నిన్ను నమ్మితి కృష్ణా.

శ్రీకృష్ణా! నందగోపునికి వరమువలన కలిగిన కుమారా, నేను జడస్వభావుడను. పాపాత్ముడను. నిందలకు పాల్పడినఅల్పుడను. ఇటువంటి అవగుణాలు కలిగినవాడనని నాయెడ సందేహింపకుము. నిన్ను నేను నమ్మినాను. నన్నుకాపాడు. (దయామయుడైన భగవంతుడు ఎంతటి పాపాత్మునైనా కాపాడునని భావం).

61. గజరాజ వరద కేశవ
త్రిజగత్కల్యాణమూర్తి దేవమురారీ
భుజగేంద్రశయనమాధవ
విజయాప్తుడ నన్నుగావు వేగమెఓ కృష్ణా.

శ్రీకృష్ణా! గజేంద్రుని రక్షించి అతనికి వరములను ప్రసాదించినవాడా, సుందరమైన కేశ సంపదకలవాడా, మూడు లోకాలకు శుభాలను సమకూర్చేవాడా, ఆదిశేషునిపై శయనించువాడా, లక్ష్మీపతీ, అర్జునునకు ప్రాణ స్నేహితుడవైనవాడా, నన్ను త్వరగా రక్షించుమయ్యా.

ఈ పద్యమంతటను భగవంతుని సంబోధనలే.

62. గోపాలకృష్ణ, మురహర,
పాపాలను పారద్రోలు ప్రభుడవు నీవే
గోపాలమూర్తి దయతో
నా పాలిట గలిగి ప్రోవు, నమ్మితి కృష్ణా.

శ్రీకృష్ణా, గోపాల కృష్ణా! మురాసురుని సంహరించినవాడవు. పాపాలను నశింప చేసేవాడవు. నాపై దయకలవాడవై, నా పక్షంలో నిలిచి నన్ను కాపాడుము. నేను నిన్ను నమ్మినవాడను.

(భక్తుడు పూర్తిగా భగవంతునిపై భారం వేయడం)

63. దుర్మతిని, మిగుల దుష్టపు
కర్మంబుల జేసినట్టి కష్టుడ నన్నున్
నిర్మలుని జేయవలె ని
ష్కర్మద నినునమ్మినాను కావుము కృష్ణా.

శ్రీకృష్ణా! దుర్బుద్ధితో ఎన్నో చెడ్డ పనులు చేసిన వాణ్ణి. కఠినాత్ముణ్ణి. సత్కార్యాలు చేసినవాణ్ణి కాదు. నిన్ను పూర్తిగా నమ్మినవాణ్ణి. నన్ను ఏ పాపము లేని వానిగాను అనగా పవిత్రునిగాను చేయవయ్యా.

64. దుర్వార చక్రధరకర,
శర్వాణీ భర్తృ వినుత, జగదాధారా,
నిర్వాణనాథ, మాధవ
సర్వాత్మక, నన్నుగావు సరగున కృష్ణా.

శ్రీకృష్ణా! నీ చేతియందు సుదర్శనమనే చక్రాన్ని ధరించినావు. పార్వతీవల్లభుడైన పరమేశ్వరునిచే కీర్తింపబడినావు. లోకాలకు ఆధారమైనవాడవు. మోక్షమునకుఅధిపతివి. సర్వమునకు ఆత్మవంటి వాడవు. అటువంటి నీవు నన్ను వేగముగా రక్షించవా?

పరమేశ్వరుడు రపరమ భాగవతోత్తముడని ప్రఖ్యాతి.

65. సుత్రామ నుత జనార్ధన
సత్రాజిత్తనయనాథ, సౌందర్యకళా

చిత్రావతార, దేవకి
పుత్రా, నను గావు నీకుపుణ్యము కృష్ణా.

శ్రీకృష్ణా! నీ చరిత్రను దేవేంద్రునంతటివాడు స్తుతి చేస్తాడు. జనుడనే రాక్షసుని నసంహరించినవాడవు. సత్రాజిత్తు కుమార్తె సత్యభామకు భర్తవు. మనోహరమైన కాంతికల అద్భుతమైన అవతారాన్ని ధరించిన వాడవు. దేవకీదేవి కుమారుడవు. నన్ను రక్షింపగా నీకు పుణ్యము కలుగును.

66. బలమెవ్వడు కరిబ్రోవను?
బలమెవ్వడు పాండు సుతుల భార్యను గావన్?
బలమెవ్వడు సుగ్రీవుకు?
బలమెవ్వడు నాకు నీవె బలమవు, కృష్ణా.

శ్రీకృష్ణా! మొసలిచే పట్టుబడిన గజరాజుకు నీవే శక్తివై కాపాడినావు. కౌరవ సభలో అవమానం పొందనున్న ద్రౌపదికి నీవే శక్తిగా ఉండి రక్షించినావు. వాలి బాధ నుండి తొలగించి, సుగ్రీవునికి బలమునిచ్చి అతనికి రాజ్యమొసగినావు. ఇందరికి శక్తివైన నీవు నాకును నీవే బలము.(ఆధారము - రక్షకుడవు).

67. పరుసము సోకినయినుమును
వరుసగ బంగారమైన వడుపున, జిహ్వాన్
హరి నీ నామము సోకిన,
సురవందిత, నేను నటుల సులభుడ కృష్ణా.

శ్రీకృష్ణా! దేవతల చేత నమస్కరింపబడినవాడా. పరుసవేది సోకినప్పుడు ఇనుము బంగారముగామారును. ఆ విధంగానే నీ నామము నాలుకకు బట్టుబడి స్మరించినంత మాత్రాన నాకు మోక్షం లభించడం సులభమవుతుంది.

ఇనుమును బంగారు చేయడానికి పరుసవేది (స్పర్శవేది) అనే ఒక రాయి ఉంటుందని విశ్వాసం.

68. ఒకసారి నీదునామము
ప్రకటముగా దలచువారి పాపములెల్లన్

విరలయ్యేలై తొలగుటకును
సకలార్థ, యజా మిళుందు సాక్షియె కృష్ణా.

శ్రీకృష్ణా! నీవు అన్ని కోర్కెలను నెరవేర్చేవాడవు. నీ నామస్మరణంచే వారి సకల పాపాలు చెల్లాచెదరై తొలగిపోతాయి. పూర్వం అజామీళుడనే వాడు అనాలోచితంగా తన కుమారుడైన నారాయణుని తన అంత్య సమయంలో పిలువగా, శ్రీమన్నారాయణుడలైన నీవుఅతనికి మోక్షం ప్రసాదించినావు. నీ దయకు అజామీళుడే సాక్షి.

69. హరి సర్వంబున గలదని
గరిమను దైత్యుండు పలుక కంబములోనన్
యిరవొంది వెడలి చీల్చవె
శరణను ప్రహ్లాదుడిందు సాక్షియె కృష్ణా.

శ్రీకృష్ణా! విష్ణువంతటను ఉన్నాడా అని హిరణ్యకశిపుడు గర్వంతో పలుకగా, నీవు కంబంలోన కూడ నివసించి దాని నుంచి బయటకు వచ్చి హిరణ్యకశిపుని చీల్చి సంహరించినావు. ప్రహ్లాదుని రక్షించినావు. నిన్ను శరణు వేడిననీ భక్తుడు ప్రహ్లాదుడే దానికి సాక్షి.

70. భద్రార్చిత శుభచరణ సు
భద్రాగ్రజ, సర్వలోకపాలన హరి, శ్రీ
భద్రాధిప, కేశవ, బల
భద్రానుజ, నన్నుబ్రోవు భవహర, కృష్ణా.

శ్రీకృష్ణా! శుభచరిత్ర కలిగిన వారిచే పూజింపబడే పవిత్ర పాదములు గలవాడా. సుభద్రాదేవికి సోదరుడైనవాడా, సమస్త లోకాలను పరిపాలించే వాడా, శ్రీహరీ, భద్రాదేవికి పతియైనవాడా, కేశవా, బలరామునికి తమ్ముడైనవాడా, పాపాలను నశింప చేసేవాడా, నన్ను కాపాడుము.

ఈ పద్యం సంబోధనాత్మకంగా ఉండడం విశేషం.

71. ఎటువలె కరిమొర వింటివి-?
ఎటువలె ప్రహ్లాదుకభయమిచ్చితి కరుణన్-?

అటువలె నను రక్షింపుము-,
కటకట నిను నమ్మినాడ, గావుము, కృష్ణా.

శ్రీకృష్ణా! గజేంద్రుని మొరనువిని నీవేవిధంగా అతనిని రక్షించినావో, ప్రహ్లాదుడు శరణువేడగా ఏ విధంగా అతనికి అభయమిచ్చి కాపాడినావో, ఆ విధంగా నన్ను కూడ రక్షింపుము. నేను నిన్ను నమ్మిఉన్నవాడను.

72. తట తట లేటికి చేసెదు -?
కట కట పరమాత్మ నీనవు ఘంటా కర్ణున్
ఎటువలె నిపుణుని చేసితి
వటువలె రక్షింపుమయ్య, యచ్యుత, కృష్ణా.

శ్రీకృష్ణా! నాశములేని వాడా. ఎందుకు మాటిమాటికి నన్ను బెదిరిస్తున్నావయ్య. ఓ పరమాత్మా! నీవు ఏవిధంగా ఘంటాకర్ణుని జ్ఞానవంతునిగా చేసినావో ఆ విధంగానే నన్ను కూడ (అజ్ఞానం నుంచి) కాపాడుమయ్యా.

ఘంటా కర్ణుడు కుబేరుని సేవకుడు. శివభక్తుడు. శ్రీహరి నామము వినబడకుండ చెవులకు గంటలు కట్టుకొన్నవాడు. విష్ణుమూర్తి అతనిని రక్షించినాడు.

73. తురగాధ్వరంబు జేసిన
పురుషులకును వేరెపదవి పుట్టుట యేమో!
హరి మిము దలచిన వారికి
నరుదా కైవల్య పదవి? యచ్చుత, కృష్ణా.

శ్రీకృష్ణా! అశ్వమేధయాగాలు చేసిన మహారాజులకు ఇంద్రపదవి వంటి అధికారము లభిస్తుందో లేదో సందేహమే. వారికి మోక్షం వస్తుందో లేదో తెలియదు. కాని హరీ, నశ్వరము లేనివాడా, నిన్ను మనస్సులో ధ్యానించిన వానికి మోక్షమనే పదవి లభించడంలో సందేహం లేదు కదా.

74. ఓ భవబంధ విమోచన,
ఓ భరతాగ్రజ, మురారి, యో రఘురామా,
ఓ భక్త కామధేనువ,
ఓ భయహర నన్ను గావుమో హరి, కృష్ణా.

శ్రీకృష్ణా! నీవు సంసారబంధాల నుండి తొలగించేవాడవు. రఘువంశంలో భరతునికి అన్నగా జన్మించినవాడవు. మురాసురుణ్ణి సంహరిరంచినవాడవు. రఘు రాముడవు. భక్తుల సమస్త వాంఛలను తీర్చే కామధేనువు వంటివాడవు భయాన్ని పోగొట్టేవాడవు. ఓ శ్రీహరీ, నన్ను కాపాడుమా.

ఈ పద్యం కూడ సంబోధనాత్మకమే.

75. ఏ తండ్రి కనక కశ్యపు
ఘాతుకుడై యతని సుతుని కరుణను గాచెన్
బ్రీతి సురకోటి బొగడగ
నా తండ్రీ, నిన్ను నేను నమ్మితి కృష్ణా.

శ్రీకృష్ణా! నా తండ్రీ పూర్వం ఎవరు ప్రహ్లాదుని తండ్రివలె ప్రవర్తించి హిరణ్యకశిపుని సంహరించి అతనిని కాపాడినాడో, అట్లా చేయడం చేత అతనిని దేవతలు మెచ్చుకొన్నారో, ఆ తండ్రియైన భగవంతుని నేను నమ్మినాను. (నన్ను కాపాడుమని).

76. ఓ పుండరీకలోచన,
యోపురుషోత్తమ, ముకుంద, యోగోవిందా,
యో పురసంహారమిత్రుడ,
యోపుణ్యుడ, నన్ను బ్రోవుమో హరి, కృష్ణా.

శ్రీకృష్ణా! తెల్లని పద్మాల్లాంటి అందమైన కన్నులు కలవాడా, పురుషుల్లో శ్రేష్ఠమైనవాడా, మోక్షమును ప్రసాదించువాడా, గోవిందా, త్రిపురాసురులను సంహరించిన మహేశ్వరుని స్నేహితుడా, పుణ్యాత్మా,చ శ్రీహరీ, నన్ను కాపాడుమా.

77. ఏ విభుడు ఘోరరణమున
రావణువధియించి, లంక రాజుగ నిలిపెన్
దీవించి యా విభీషణు,
నా విభునే దలతు మదిని నచ్యుత కృష్ణా.

శ్రీకృష్ణా! నాశము లేనివాడా, భయంకర యుద్ధంలో ఏ రాజు, రాక్షస రాజు రావణుని సంహరించి, విభీషణునికి అభయమిచ్చి అతనిని లంకారాజ్యానికి అధిపతిని చేసెనో, ఆ రాజగు శ్రీరామచంద్రునినేను నా మనస్సులో ఎప్పుడును భావించుకొంటాను.

రామాయణంలోని విభీషణుశరణాగతి దీనిలో సూచింపబడింది.

78. గ్రహభయ దోషములొందవు
బహు పీడలు చేర వెరచు పాయును నఘముల్
ఇహపర ఫలదాయక విను
తహ తహ లెక్కడివి? నిన్ను దలచిన కృష్ణా.

శ్రీకృష్ణా! నిన్ను తలచినంత మాత్రాన గ్రహముల వలన కలిగే కష్టాలు తొలగిపోతాయి. పాపాలు నశించుతాయి. బాధలు దరిచేరవు. ఈ లోకంలోను పరలోకంలోను పుణ్యఫలం లభిస్తుంది. చీకాకులింక ఎక్కడివి? అన్నియు సుఖశాంతులే కలుగుతాయి.

79. గంగ మొదలైన నదులను
మంగళముగ జేయునట్టి మజ్జనములకున్
సంగతి గలిగిన ఫలములు
రంగుగ మిము దలచు సాటిరావుర! కృష్ణా.

శ్రీకృష్ణా! గంగ యమున మొదలైన పుణ్యనదుల్లో స్నానాలు చేయడం వలన లభించే పుణ్యం, సకల తీర్థాలలో మునగడం వలన కలిగే సత్ఫలం. బాగుగా మీ నామస్మరణం చేయడం వలన కలిగే పుణ్యానికి సమానం కానే కావు.

80. ఆ దండకా వనంబున
కోదండము దాల్చినట్టి కోమల మూర్తీ -?
నా దండ గావ రమ్మీ - ?
వేదండము గాచినట్టి వేలుప, కృష్ణా.

శ్రీకృష్ణా! ఏనుగుల రాజును రక్షించినట్టి దైవమా. నీవు దండకారణ్యంలో ధనుర్బాణాలను ధరించి క్రూర రాక్షసులను దునుమాడిన సుకుమార స్వరూపుడవు. నీవు నా పక్షంలో నిలిచి నన్ను కాపాడదానికి రావా!

81. చూపుము నీ రూపంబును
పాపపు దుష్కృతము లెల్ల పంకజనాభా

పాపుము నాకును దయతో
శ్రీపతి నిను నమ్మినాద, సిద్ధము, కృష్ణా.

శ్రీకృష్ణా! పద్మనాభా, శ్రీపతీ, నీ దివ్య మంగళ రూపాన్ని నాకొక్కసారి దర్శింప చేయవా? దానివలన నేను చేసిన పాపాల దుష్టమైన పనులు తొలగించి వేయుము. నా పాపాలను నశింప చేయుము.

భగవద్దర్శనం వలన సమస్త దోషాలు, పాపాలు తొలగిపోతాయి.

82. నీ నామము భవహరణము –,
నీ నామము సర్వ సౌఖ్య నివహాకరంబు
న్నీనామ మమృతపూర్ణము –?
నీ నామము నే దలంతు నిత్యము కృష్ణా.

శ్రీకృష్ణా! నీ పేరు సంసారబంధాలను నశింపచేసేది. (పాపాలను హరింప చేసేది) నీ నామము సకల సుఖాల సమూహాన్ని కలుగజేస్తుంది. నీ నామం అమృతంతో నిండినట్టిది (నాశం లేకుండ చేసేది). ఎప్పుడును నేను నీ నామం స్మరించుకొంటూ ఉంటాను.

83. పరులను నడిగిన జనులకు
కురుచసుమీ, యది యటంచు గురుతుగ నీవున్
గురుచుడవై వేడితి మును
ధరపాదత్రయము బలిని తద్దయు కృష్ణా.

శ్రీకృష్ణా! ఇతరులను యాచించిన వారికి తక్కువ తనం కలుగుతుందని భావించడం ఉన్నది. అది నిజం అయ్యేటట్లుగా నీవు వామనావతారంలో వామనుడవై (పొట్టివాడవై) బలి చక్రవర్తిని మూడు అడుగుల నేలను దానంగా అడిగినావు కదా.

ఇది వ్యాజోక్తి.

84. రఘునాయక నీ నామము
లఘుమతితో దలచగలనె, లక్ష్మీరమణా – ?
యఘములు బాపుడు దయతో –?
రఘురాముడ వైన లోక రక్షక కృష్ణా.

శ్రీకృష్ణా! లక్ష్మీపతీ, రఘువంశంలో జన్మించిన శ్రీరామా, నీ నామం నావంటి అల్పబుద్ధులకు భావించడం సాధ్యమవుతుందా? కాదు. నీవు పాపాలను నశింప చేసేవాడవు. లోకాలను రక్షించే వాడవు. నా పాపాలను దయతో తొలగించవా?

85. **పాలను వెన్నయు ముచ్చిల**
రోలను మీ తల్లి గట్ట రోషముతోడన్
లీలా వినోదివైతివి -?
బాలుడవా? బ్రహ్మ గన్న ప్రభుడవు! కృష్ణా.

శ్రీకృష్ణా! రేపల్లెలో గొల్లభామల ఇండ్లలో పాలు, వెన్న దొంగిలించినందుకు నీపై కోపగించిన యశోదాదేవి నిన్ను రోలుకు కట్టివేసింది. దానిని నీవు ఆటగా భావించినావు. యమళార్జున మోక్ష లీల జరిపినావు. నీవు సామాన్యబాలుడవు కావు. సృష్టికర్త బ్రహ్మను కన్న సాక్షాత్తు నారాయణమూర్తివి.

86. **అప్పాయిత్తువు దయతో**
నప్పాలను నతి రసంబు ననుభవశాలీ
యప్పాలను గనుగొనవే
యప్పా, నను బ్రోవు వేంకటప్పా, కృష్ణా.

శ్రీకృష్ణా! ననుగన్న తండ్రీ, వేంకటపతీ, నీవు సృష్టి అనే అనుభవం కలవానివి. అనేక తీయని పదార్థాలను, బూరెలను మా జీవనము కొరకు అనుగ్రహింతువు. నేను సమర్పించే అప్పాలను (భక్ష్యములను) స్వీకరించుమా. నన్ను కాపాడుమా.

87. **కొంచెపువాడని మదిలో**
నెంచకుమీ వాసుదేవ గోవింద హరీ,
అంచితముగ నీ కరుణకు
గొంచెము నధికంబు గలదె? కొంత కృష్ణా.

శ్రీకృష్ణా, హరీ, గోవిందా, వసుదేవకుమారా, నీ దయకు అందరూ పాత్రులే. కొద్దివారు, అధికులు అనే సందేహం నీకు లేదు. ఎల్లరను సమానంగా దయా దృష్టితో చూస్తావు. నేను అల్పుడనని నీ మనస్సులో భావించక నన్ను కాపాడు.

88. వావిరి నీ భక్తులకున్
గావరమున నెగ్గుసేయు గర్వాంధులకున్

దేవ, వధించుటవింటిని
నీవల్లను భాగ్యమయ్యె నిజముగ కృష్ణా.

శ్రీకృష్ణా, దేవా, నీ భక్తులైన వారిని, అధికమైన గర్వంచేత అంధులైన క్రూరులు, బాధించగా నీవు వారిని వధించినావని విన్నాను. ఇటువంటి పనిచేయడం వలన లోకానికి. నీ భక్తులకు సౌభాగ్యం కలిగింది కదా. ఇది యధార్థము.

భగవానుని శిష్టరక్షణ దుష్టశిక్షణ సూచితమైంది.

89. అయ్యా పంచేంద్రియములు
నుయ్యాలల నూచినట్టు లూచగనేనున్
నీ యాజదలపనేరను -
కుయ్యాలింపుము మహాత్మ! గురుతుగ కృష్ణా.

శ్రీకృష్ణా! మహాత్మా! నా మనస్సు నిలుకడలేనిది. కన్ను, చెవి, ముక్కు, నాలుక, చర్మము అనే పంచేంద్రియాలు నా మనస్సును పలువిషయాలపై ఉయ్యాలలూగిస్తున్నాయి. (సంచలనం చేస్తున్నాయి). అందువలన నేను నీ ఆజ్ఞను భావించడంలేదు. నా మొరనాలకించి నన్ను రక్షింపవా?

90. కంటికి రెప్పవిధంబున
బంటుగదా యనుచు నన్ను బాయక యెపుడున్
జంటయు నీవుండుట నే
కంటకమగు పాపములను గడచితి కృష్ణా.

శ్రీకృష్ణా! నీవు నన్ను సేవకునిగా భావించి, కంటికి రెప్పవలె నన్ను వదలక నన్ను కాపాడితివి. నాకు తోడుగా ఉంటివి. అందుచేతనే ముళ్లవలె బాధాకరమైన పాపాలలో పడక నేను వాటిని దాటినాను. ఇది నీ దయకదా.

91. యమునికి నిక నే వెరవను -?
కమలాక్ష జగన్నివాస కామిత ఫలదా - ?
విమలమగు నీదు నామము
సమరగ దలచెదను వేగ ననిశము కృష్ణా.

శ్రీకృష్ణా, కమలనేత్రా, జగన్నివాసా, ఇకపై నేను యమధర్మరాజుకు భయపడను. (మృత్యువంటే చలించను). స్వచ్ఛమైన నీ పేర్లను వేగంగాను, ఎప్పుడును భావిస్తుంటాను. శ్రీకృష్ణ నామం స్మరించేవారికి యమధర్మరాజు పట్లగాని, అతని దూతల పట్లగాని భయం ఉండదు.

92. దండమయా విశ్వంభర
దండమయా పుండరీకదళనేత్రహరీ,
దండమయా కరుణానిధి –,
దండమయా నీకు నెపుడు దండము కృష్ణా.

శ్రీకృష్ణా, విశ్వమును (లోకాలను) భరించినవాడా, తెల్లని పద్మాలవంటి అందమైన కన్నులుగలవాడా, శ్రీహరీ, దయానిధీ నీకు నేను ఎల్లప్పుడు దండము సమర్పిస్తాను.

విష్ణుమూర్తికి దండము సమర్పించిన వారిని రక్షిస్తాడని పురాణేతిహాసాలు చెప్పుతున్నాయి.

93. నారాయణ లక్ష్మీపతి
నారాయణ, వాసుదేవ, నందకుమారా,
నారాయణ నిను నమ్మితి
నారాయణ నన్నుబ్రోవే, నగధర, కృష్ణా.

శ్రీకృష్ణా, శ్రీమన్నారాయణా, లక్ష్మీపతీ, వసుదేవకుమారా, నందునిచే పోషింపబడినవాడా, గోవర్ధన గిరిధారీ, నిన్ను నేను నమ్మినాను. నన్ను దయతో రక్షింపుమా.

శ్రీమాన్నారాయణ నామస్మరణ సర్వరక్షకమని సంప్రదాయం.

94. తిరుమణి దురిత విదూరము
తిరుమణి, సౌభాగ్యకరము త్రిజగములందున్–,
తిరుమణి పెట్టిన మనుజుడు
పరమ పవిత్రుండు భాగ్యవంతుడు, కృష్ణా.

శ్రీకృష్ణా! ముఖము నందు తిరుమణి తుచూర్ణములతో ఊర్ధ్వ పుండ్రములు ధరించితే, అన్ని పాపాలు దూరమవుతాయి. అవి మూడు లోకాల్లోను (స్వర్గ

మర్త్యపాతాళలోకాలు) సుఖసంతోషాలను కలుగ జేస్తాయి. ఊర్ధ్వ పుండ్రములు ధరించిన మనుష్యుడు చాల స్వచ్ఛమైనవాడు. అన్ని భాగ్యాలను పొందినవాడవుతాడు.

వైష్ణవులు ఊర్ధ్వపుండ్రములను పవిత్రంగా భావిస్తారు.

95. **సర్వేశ్వర, చక్రాయుధ**
శర్వాణీవినుత నామ, జగదభిరామా,
నిర్వాణ నాథ మాధవ
సర్వాత్మక నన్నుగావు సదయత కృష్ణా.

శ్రీకృష్ణా! చక్రమనే ఆయుధాన్ని ధరించినవాడవు. పార్వతీ దేవి నీ పేరును ఎప్పుడూ స్తుతి చేస్తూ ఉంటుంది. జగత్తులో నీవు చాల సుందరమైనవాడవు. మోక్షానికి అధీనుడవు. లక్ష్మీదేవి భర్తవు. సకల లోకాలకు అధిపతివి. సమస్తమునకు ఆత్మగా ఉన్నవాడవు. నన్ను దయతో కాపాడుమా!

96. **శ్రీలక్ష్మీ నారాయణ**
వాలాయము నిన్ను దలతు వందిత చరణా,
ఏలుము నను నీ బంటుగ
చాలగనిను నమ్మినాడ సరసుడ, కృష్ణా.

శ్రీకృష్ణా, లక్ష్మీనారాయణమూర్తీ, నమస్కరింపబడి పాదములు కలవాడా, రసస్వరూపంగలవాడా, ఎప్పుడు నిన్ను భావించుకొంటూ ఉంటాను. నిన్ను మాత్రమే నమ్మినట్టివాణ్ని. తగిన విధంగా నన్ను నీ దాసునిగా గ్రహించి పాలించుమా (రక్షింపుమా).

97. **శ్రీధర మాధవ యచ్యుత**
భూధర పురుహూత వినుత పురుషోత్తమ, నీ
పాదయుగళంబునెప్పుడు
మోదముతో నమ్మినాడ, ముద్దుల కృష్ణా.

శ్రీకృష్ణా, శ్రీహరీ, నీవు తలపై రత్నములు తాపిన కిరీటాన్ని ధరిస్తావు. రెండు చేతులలో శంఖచక్రాలను, ఇతరములైన నగలను (కేయూరాదులు) ధరిస్తావు. వక్షస్థలంలో కౌస్తుభమనే వజ్రాల పతకాన్ని అలంకరించుకొంటావు. లక్ష్మీపతీ! ఇవన్నీ నీకు చక్కగా అమరుతాయి.

99. అందెలు పాదములందున
సుందరముగ నుంచినావు సొంపలరంగా -,
మందరధర మునిసన్నుత -,
నందుని వరపుత్ర, నిన్ను నమ్మితి కృష్ణా.

శ్రీకృష్ణా, మందర పర్వతభారాన్ని (కూర్మావతారంలో) మహించినవాడా, మునులచేత స్తుతింపబడినవాడా, నీవు పాదములకు ఇంపుగా ధ్వనించే అందెలు అనే ఆభరణాలు ధరించినావు. నీవు నందునికి వరము చేత లభించిన ఉత్తమకుమారుడవు. స్వామీ, నిన్ను నేను నమ్మినాను కదా.

100. కందర్పకోటి సుందర
మందర ధర నామతేజ మధుసూదన, యో
సుందర విగ్రహ, మునిగణ
వందిత, మిము దలతు భక్తవత్సల కృష్ణా.

శ్రీకృష్ణా! నీవు కోటిమంది మన్మథులతో సాటియైన సౌందర్యం గలవాడవు. మందరపర్వతభారాన్ని వహించినవాడవు. ప్రకాశవంతమైననామములు కలిగినవాడవు. మధువనే రాక్షసుని సంహరించినవాడవు. అందమైన స్వరూపం గలవాడవు. మునుల సమూహం నీకు ఎప్పుడు నమస్కరిస్తుంది. అటువంటి మిమ్ములను భావించుకొంటాను.

101. అనుదినము కృష్ణశతకము
వినిన పఠించినను నరముక్తి వేడుక కలుగున్
ధనధాన్యము గోగణములు
తనయులు నభివృద్ధి పొందు తద్దయు కృష్ణా.

శ్రీకృష్ణా! ప్రతిదినం ఈ కృష్ణ శతకాన్ని జనులు విన్నాకాని, చదివినాకాని మోక్షం లభిస్తుంది. సంతోషం కలుగుతుంది. ధన ధాన్యాలు సమకూరుతవి. గోవులు సమృద్ధిగా ఉంటాయి. కుమారులకు (సంతానానికి) వృద్ధికలుగుతుంది. ఇది శుభప్రదం. (ఫలశ్రుతి).